క్లుప్తంగా

వలసలు అరికట్టాలి


ఈఓఆర్డీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఓర్వకల్లు: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం దగ్గర ఈఓఆర్డీ సుబ్బరాయుడుకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వ్యకాస మండల కన్వీనర్ నాగన్న మాట్లాడుతూ స్థానికంగా పనులు లేనందున కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. అలాగే పనులు చేసిన కూలీలకు వారం రోజుల్లో వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్, మాసూం బాషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ నగర్‌లో చైన్‌స్నాచింగ్

కర్నూలు (రూరల్) : బాలాజీ నగర్ ఉర్దూ స్కూల్ సమీపాన వృద్ధురాలు సరస్వతమ్మ బంగారం గొలుసును గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. గురువారం తెల్లవారుజామున ఇంటి ఎదుట శుభ్రం చేసి పూజకు పూలు తెచ్చుకుంటుండగా ఇద్దరు అగంతకులు బైక్‌పై వచ్చి రెండున్నర తులాల బంగారం గొలుసును లాక్కుని ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ పీరయ్య తెలిపారు.

సమయపాలన పాటించండి

గడివేముల: సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి హెచ్చరించారు. గడివేముల మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్లను ఆమె ప్రారంభించారు. అదేవిధంగా బుజునూరు గ్రామంలో సచివాలయం, రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్త, బూజునూరు సర్పంచ్ రాములమ్మ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల ఆశయాలు సాధిద్దాం

కల్లూరు: అమరవీరుల ఆశయాలను సాధిద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం బొల్లవరం గ్రామంలో కామ్రేడ్ నీలం రామచంద్రయ్య స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ దేశంలో శాస్త్రీయ విద్యా విధానం, సమసమాజ స్థాపన లక్ష్యంగా విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నాయకులు దామోదర్, శశికాంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యూటీఎఫ్ జిల్లా మహాసభలు

కల్లూరు: మండల కేంద్రం గూడూరులో ఈ నెల 9, 10 తేదీల్లో యూటీఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు లక్ష్మీకాంత్, హేమంత్‌కుమార్ తెలిపారు. గ్లోబల్ స్కూల్‌లో రెండు రోజులు నిర్వహిస్తున్న సభలకు నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పేదల విద్యాభివృద్ధికి కృషి చేయాలి


ప్రతిభ చాటిన పదవతరగతి విద్యార్థులను సత్కరించిన ట్రస్ట్ సభ్యులు, అధికారులు

సి.బెళగల్: స్వచ్ఛంద సంస్థలు పేదల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా సూచించారు. మండలంలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎం నిర్మలవసంతకుమారి అధ్యక్షతన ఆ పాఠశాల స్థల దాత శ్రీరాములువారి కుటుంబ సభ్యులతో కలిసి గొల్ల బుడ్డన్న గార్ల లక్ష్మమ్మ, ఉదయ్ కిరణ్ స్మారక సేవా సంస్థ (జీబీఎల్ -యూకే ట్రస్ట్) ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షుడు రామంద్రుడు, మేనేజర్ జయరాముడు మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులకు ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బురాన్‌దొడ్డి హైస్కూల్ ముగ్గురు విద్యార్థులతోపాటు, మండలంలో ఉత్తమ మార్కులు సాధించినవారికి నగదు బహుమతులతోపాటు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, అధ్యక్షుడు తరుణ్‌కుమార్, డైరెక్టర్లు పృథ్వీ, సాయికృష్ణ, శ్రీనివాసులు, ట్రెసరర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం!

- గోడౌన్ల నిర్మాణాలు పూర్తయినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- మైనర్ పనులు చేపట్టని అధికారులు
- నేటికీ అందుబాటులోకిరాని వైనం
- రైతులకు తప్పని ఇబ్బందులు


మద్దూరులో షటర్‌కు నోచుకోని గోడౌన్

పాణ్యం: టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కనీసం పూర్తయిన గోడౌన్లను సైతం రైతులకు అందుబాటులోకి తీసుకురాని సర్కార్ తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా చేయూతనిస్తూ సచివాలయాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించిన విషయం తెలిసిందే. అదేవిధంగా సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేస్తూ రైతులకు అండగా నిలిచిన గత ప్రభుత్వం సాగు దిగుబడులు నిల్వ చేసుకునేందుకు రూ.లక్షలు వెచ్చించి గోడౌన్‌లు నిర్మించింది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 52 సహకార సొసైటీలు ఉండగా మొదటి దఫాగా 133 గోడౌన్‌లు మంజూరు చేసింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. 67 గోడౌన్లు 1,000మెట్రిక్ టన్నులు, 66 గోడౌన్‌లు 500మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 119 గోడౌన్లు నిర్మించారు. 500మెట్రిక్ టన్నుల గోడౌన్‌కు రూ.40లక్షలు, 1,000మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోడౌన్‌కు రూ.75లక్షలు చొప్పున ఖర్చు చేశారు. 119 గోడౌన్‌లను రైతులకు అందుబాటులోకి వచ్చాయి. కేవలం 14 గోడౌన్లకు సంబంధించి మాత్రం షటర్, కిటికీలు తదితర మైనర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు చేయడానికి చొరవ తీసుకోని అధికారుల తీరును రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించిన అభివృద్ధి పనులు అంటే కూటమి సర్కార్‌కు ఎందుకంత నిర్లక్ష్యం అంటూ నిలదీస్తున్నారు అన్నదాతలు.

నిరుపయోగంగా గోడౌన్లు

రైతులు తమ దిగుబడులను నిల్వ చేసుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా వ్యాప్తంగా 133 గోడౌన్‌లు మంజూరు చేయగా ఇందులో పాణ్యం మండలానికి రెండింటిని కేటాయించింది. ఈ మేరకు పాణ్యం మండల పరిధిలోని మద్దూరు, సుగాలిమెట్ట వద్ద నిర్మించిన గోడౌన్‌లకు సంబంధించి మైనర్ పనులు పెండింగ్ ఉన్నాయి. మద్దూరు రూ. 40 లక్షలు వెచ్చించి 500మెట్రిక్ టన్నులు, సుగాలిమెట్ట వద్ద రూ. 75 లక్షలు వెచ్చించి 1,000 మెట్రిక్ టన్నుల గోదాములు నిర్మించినప్పటికీ మైనర్ పనులు పెండింగ్ మూలంగా రైతులకు నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాణ్యం మండలంలో వరి, మొక్కజొన్నపాటు కంది, మినుముల, మిరప, పెసర అధికంగా సాగు చేస్తారు. దిగుబడులు నిల్వ చేసుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ ఏడాదికే అందుబాటులోకి వస్తాయనుకున్న గోదాములను అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మైనర్ పనులు కూడా చేయించడం లేదని కూటమి సర్కార్ తీరును తప్పుపడుతున్నారు రైతులు.

మార్చి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు

నంద్యాల జిల్లాలో పండింగ్ ఉన్న గోదాములను మార్చి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 119గోదాములను పూర్తి రైతులకు అందుబాటులోకి తెచ్చాం. అదేవిధంగా మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు మార్చి వరకు గడువు ఉంది. సకాలంలో వాటిని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే పెండింగ్ పనులపై దృష్టి సారించాం.

– సుబ్బారెడ్డి కేడీసీసీ డీఈ నంద్యాల

తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు

కోడుమూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం కోడుమూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు పాల్పడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోపాటు లీగల్ సెల్ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ప్రభాకర్ సూచించారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, కేసులు పెట్టడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన 5నెలల్లోనే రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అరాచకాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని, నిందితులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రభాకర్ విమర్శించారు.

వాడీవేడిగా గూడూరు కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు

కోడుమూరు రూరల్ : గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ నాగరాజు నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, కో-ఆప్షన్ మెంబర్ రామాంజినేయులు అధికారులు తీరును తప్పుపట్టారు. నగర పంచాయతీలో నిధులున్నా వార్డుల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ఎందుకు చొరవ చూపడం లేదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో పనిచేసిన ఇంజినీరింగ్ అధికారి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గూడూరులో నెలకొన్న సమస్యలు ఏవి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. విధులను నిర్లక్ష్యం చేసిన సదరు ఇంజినీరింగ్ అధికారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలంటూ కౌన్సిలర్లు మూకుమ్మడిగా తీర్మానించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మార్కెట్ వేలం పాట సొమ్మును రికవరీ చేయాలని, ప్రతి నెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని అధికారులు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు దస్తగిరి, సురేష్, కలామ్, కలీల్, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: సాగునీటి సంఘాల ఎన్నికలకు అవసరమైన ఓటరు జాబితాను త్వరగా సిద్ధం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులతో కలిసి వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. ఈనెల 10లోగా సాగునీటి రైతుల వివరాలను సేకరించి, ఓటరు జాబితా రూపొందించాలన్నారు. అదేవిధంగా 11, 12వ తేదీలలో ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, మార్పులు, చేర్పుల అనంతరం 13వ తేదీ తుది జాబితాను ప్రకటించాల్సి ఉంటదన్నారు. సమావేశంలో డీటీ పురుషోత్తం, ఏఎస్ఓ ఆదినారాయణ, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ అధికారులు, ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్, ఉదయ్ భాస్కర్, లక్ష్మినారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూకరాజు

కల్లూరు: వాతావరణ మార్పుల మూలంగా సోకే సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూకరాజు సూచించారు. మండల పరిధిలోని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా (ఎన్‌వీబీడీసీపీ) జాతీయ కీటక జనిత వ్యాధులు, మలేరియా ఇతర వైరల్ జ్వరాల గురించి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. గ్రామాల్లో వీధులలో, డ్రైనేజీ కాలువలో దోమలు, లార్వాలు వృద్ధి కాకుండా ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు రఘు, శ్రీధర్‌రెడ్డి, నవీన్, ఎంపీహెచ్ఈఓ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- సీపీఐ నాయకుల రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించిన సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్ : కోడుమూరు హంద్రీ నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కోడుమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదేవిధంగా రాస్తారోకో చేపట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు వరంగా మారిందన్నారు. కోడుమూరు హంద్రీ నుంచి రోజుకు 300నుంచి 400ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఇసుకను ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించకూడదన్న నిబంధనలున్నా అధికారులు నిర్లక్ష్యంగా హంద్రీనదిని ఇసుకాసురులు తోడేస్తున్నారని వాపోయారు. అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఈ ప్రాంత వాసులు కూడా ఇసుక దొరకదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హంద్రీలో ఇసుక మేటలు లేక నీళ్ల నిల్వక తరచూ కోడుమూరుతో పాటు హంద్రీ పరివాహక ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి సమస్య నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి చిన్న రాముడు, నాయకులు మునిస్వామి, సుంకన్న, శివుడు, మద్ది తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతి


సీఐ తబ్రేజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్ : హంద్రీ నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం సీఐ తబ్రేజ్, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఈఓ అజయ్‌భాస్కర్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే కోడుమూరులో ఇసుక దొరకని పరిస్థితి నెలకొంటుందని అధికారులకు నాయకులు విన్నవించారు. హంద్రీ ఇసుకను స్థానికుల అవసరాలకు మాత్రమే వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ, రాజు, మునిస్వామి, సుంకన్న, శివుడు, బజారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ట్రాక్టర్లు సీజ్

కోడుమూరు రూరల్ : కోడుమూరు హంద్రీ నది నుంచి అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తహసీల్దార్ వెంకటేష్ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ హంద్రీనది నుంచి స్థానికులు మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని సూచించారు. నిబంధనల ప్రకారం నదీతీరాన ఉన్న గ్రామాల ప్రజలు ముందస్తుగా ఉచిత ఇసుకకు అనుమతులు తీసుకున్న తర్వాతనే ఇసుకను తీసుకెళ్లాలని సూచించారు. అలాగే నదీపరివాహక ప్రాంతాల్లో గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు వేసిన మంచినీటి బోర్లకు 200మీటర్ల దూరంలో వాల్టా చట్టం ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో ఇసుకను తరలించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవ్వరైనా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాల డెయిరీలో తనిఖీలు


పాల పదార్థాలను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఫుడ్ సెఫ్టీ అధికారులు

పాణ్యం: పాణ్యంలోని శ్రీనివాస డెయిరీలో గురువారం విజిలెన్స్, ఫుడ్‌సెఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. డెయిరీలో విజిలెన్స్ సీఐ రామక్రిష్ణ, ఫుడ్ సెఫ్టీ అధికారి వెంకటరాముడు తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, పాలు, పెరుగు, నెయ్యి తదితర పదార్థాలను పరిశీలించారు. పెరుగు, నెయ్యి నమునాలు ల్యాబ్ పంపుతామని అధికారులు తెలిపారు.

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలి


అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీడీ శ్యామల

సి.బెళగల్: గృహ నిర్మాణలో పురోగతి సాధించేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల పేర్కొన్నారు. గురువారం జిల్లా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌కు ఆమె హాజరయ్యారు. వీసీ అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, హౌసింగ్, ఉపాధి, డీఆర్‌డీఏ అధికారులు, హెచ్ఎంలతో డీడీ సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రభుత్వ నిర్మాణ పథకాలపై ప్రభుత్వ లక్ష్యాలు, పురోగతిని డీడీ అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలతో పాటు, ఉపాధిహామీ పనుల కల్పన, మంచినీటి సరఫరా తదితర అంశాలపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీఓ రాణెమ్మ, హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ లక్ష్మన్న, ఏపీఎం రామేశ్వర్, గురుకుల, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు బలరాముడు, వంశీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ లక్ష్మి

ఓర్వకల్లు: గ్రామాల్లోని మంచి నీటి ట్యాంకులను నిర్దేశించిన సమయంలోపు శుభ్రం చేయాలని డీఎల్‌పీఓ లక్ష్మి ఆదేశించారు. మండలంలోని నన్నూరు, లొద్దిపల్లె గ్రామాలలో గురువారం ఆమె పర్యటించారు. నన్నూరులో మురుగు కాల్వలు, పారిశుద్ధ్య లోపాలను పరిశీలించారు. అనంతరం స్థానిక మంచి నీటి ట్యాంక్‌పైకి వెళ్లి లోపలి భాగాన్ని పరిశీలించారు. అనంతరం లొద్దిపల్లె గ్రామాన్ని సందర్శించి, అక్కడ కూడ పారిశుద్ధ్య లోపాలు, మురుగు కాల్వలు, మంచినీటి ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్‌పీఓ లక్ష్మి మాట్లాడుతూ, గ్రామీనుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కాల్వల్లో మురుగు నీరు నిల్వవుండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సుబ్బరాయుడు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బసీరున్నిసా, మద్దిలేటి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మునిస్వామి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన సర్వసభ్య నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీఓ రాణెమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండలమీట్ ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన ఆరు సెట్ల ను 10 గంటలలోపు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నైపుణ్య గణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీష్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నైపుణ్య గణన సర్వేను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి 15నుంచి 59సంవత్సరాల్లోపు వారి విద్యార్హతలు, వారికి ఏ రంగంపై మక్కువ ఉంది తదితర వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం శిక్షకులు హరీష్, నాగజ్యోతి సర్వే విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కిల్ సంస్థ మండల కో-ఆర్డినేటర్ ప్రశాంత్, ఈఓ అజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ వైద్య పరీక్షలతో క్యాన్సర్ దూరం


సి.బెళగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మద్దూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సి.బెళగల్: ప్రజలు తమ ఆరోగ్య పరీక్షలను రెగ్యులర్‌గా చేయించుకుంటే క్యాన్సర్‌ను దూరం చేసుకోవచ్చని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం కాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి స్థానిక పీహెచ్‌సీ నుండి బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించి డాక్టర్ మాట్లాడారు. మద్యపానం, దూమ పానంతో క్యాన్సర్ సోకే అవకాశం అధికంగా ఉంటుందని హెచ్చరిచారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఉమామహేశ్వరి, హెల్త్ సూపర్ వైజర్లు మంగమ్మ, మద్దిలేటి, హెల్త్ ఎడ్యూకేటర్ సుజాత, ఏఎన్ఎలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాణ్యం: ప్రజలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీతసూచించారు. జాతీయ క్యాన్సర్ దినోవత్సం సందర్భంగా గురువారం మద్దూరు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ ప్రతి పౌరుడు క్యాన్సర్ లక్షణాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్, సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులు ఉలిందకొండ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘు మాట్లాడుతూ అందరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షతో క్యాన్సర్‌పై విజయం

కోడుమూరు రూరల్ : ముందస్తుగా నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షతో క్యాన్సర్‌ను గుర్తించి నివారించవచ్చునని కోడుమూరు కోలోకోటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీమంత్ మాదన్న తెలిపారు. క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం కోడుమూరులో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శ్రీమంత్‌మాదన్న మాట్లాడుతూ క్యాన్సర్ పొగాకు ఉత్పత్తులు వాడే వారికి వస్తుందని, వీటికి దూరంగా ఉండాల ని సూచించారు. ఈనెల 14వతేదీ నుంచి వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని, ప్రజలు సహకరించాలని కో రారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లద్దగిరిలో...


లద్దగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మండలంలోని లద్దగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్లు భాస్కర్, జయంతి వైద్య సిబ్బందితో కలిసి క్యాన్సర్‌పై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, సూపర్‌వైజర్ శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో...

మండల కేంద్రం గూడూరులో పీహెచ్‌సీ డాక్టర్లు షఫీయాబేగం, ప్రత్యూషా, ఎంపీహెచ్ఈఓ రామక్రిష్ణయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ క్రిష్ణారెడ్డి, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌పై ప్రజలకు వైద్యులు అవగాహన కల్పించారు.